క్లుప్తంగా

నేడు బోనాల వేడుకపై మంత్రి తలసాని సమీక్ష

అంబర్‌పేట: బోనాల వేడుకల నిర్వహణపై నేడు అంబర్‌పేట మహంకాళి దేవస్థానం సేవా సమితి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు సమితి ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అంబర్‌పేట మహంకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే సమీక్ష సమావేశానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమీక్షా సమావేశానికి అన్ని విభాగాల అధికారులతో నిర్వహించడం జరుగుతుందన్నారు. బోనాల వేడుకలు నియోజకవర్గంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా జరిగేలా సమన్వయం చేసేందుకు సమీక్షా జరుగుతుందని తెలిపారు.

రేపు శని త్రయోదశి పూజలు

నల్లకుంట: శని త్రయోదశిని పురస్కరించుకొని శనివారం (రేపు) న్యూ నల్లకుంటలోని శ్రీ సీతా రామాంజనేయ సరస్వతి ఆలయంలో గల నవగ్రహ మందిరంలో ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ ఈఓ జయంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శనికి తైలాభిషేకాలు, మధ్యాహ్నం నవగ్రహ పూజ ఉంటుందని చెప్పారు. తైలాభిషేకంలో పాల్గొనాలకునే భక్తులు వివరాల కోసం ఆలయ అర్చక స్వామి, ఆలయ గుమస్తాను సంప్రదించాలని సూచించారు.

2న బాబా స్వర్ణ వేదిక, సింహాసనం, స్వర్ణ తోరణాల ఆవిష్కరణ

నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో జూలై 2న (ఆదివారం) సాయిబాబా స్వర్ణ వేదిక, సింహాసనం, దత్తాత్రేయ స్వామి, అభయాంజనేయ స్వామి స్వర్ణ మకర తోరణాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని షిరిడీ సాయిబాబా సంస్థాన్ పాలక మండలి ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, విశిష్ట అతిథిగా మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌రావు, గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్, షిరిడీ సాయిబాబా సంస్థాన్ చైర్మన్ ఎస్.రాజు, బి. పద్మా వెంకట్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ సాయి వ్రతం ఉంటుందన్నారు.

నియామకం


అవ్వారి భాస్కర్

కాచిగూడ: అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జిగా అవ్వారి భాస్కర్‌ను నియమిస్తూ గురువారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఆయనకు సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌ను పలువురు పద్మశాలి సంఘం నేతలు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వనం విశ్వనాథం , వనం దుశ్యంతల, యర్రమాద వెంకన్న, బొల్ల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులను ఖండిస్తున్నాం'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉత్తర ప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌లో భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై జరిగిన కాల్పులను ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. గురువారం బాగ్ లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రవి మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్‌ఆజాద్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపి పారిపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. పారిపోయిన వారు ఉపయోగించిన వాహనం గుర్తింపు ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మనువాద పాలనలో సామాజిక, శక్తులపైన ప్రజాస్వామిక వాదులపైన అనేక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కమ్యూనిటీహాల్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం



చిక్కడపల్లి: కమ్యూనిటీహాల్ భవనం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. గురువారం డివిజన్‌లోని అశోక్‌నగర్ వెల్ఫేర్ కల్చర్, వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధిలో భాగంగా ఎంపీ లడ్స్ నిధులను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మంజూరుచేసి కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి సహకరిస్తున్నారన్నారు. ప్రజల అవసరార్థం కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులను మంజూరుచేయడం పట్ల స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర్ మాజీ అధ్యక్షులు వినయ్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు రమణమూర్తి, కార్యదర్శి సూర్యప్రకాష్, హనుమంతరావు, పద్మావతి పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు
- ప్రార్థనల సందర్భంగా కొనసాగిన ట్రాఫిక్ ఆంక్షలు
- శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు అధికార, అనధికార ప్రముఖులు


భోలక్‌పూర్‌లోని బడిమసీదులో..

ముషీరాబాద్: బక్రీద్ పండగను ముషీరాబాద్ నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గురువారం మసీదుల్లో వేల సంఖ్యలో ముస్లింలు పాల్గొని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, భోలక్‌పూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అఖిల్ అహ్మద్, టీడీపీ మైనార్టీ కమిటి నగర కార్యదర్శి అక్లక్‌హుస్సేన్, ఎంఐఎం పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ మోహినుద్దీన్ తదితరులు మసీదుల వద్ద ముస్లింలను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పండగను పురస్కరించుకొని మేకలు, పొట్టేళ్లను వధించి బంధుమిత్రులకు, పేదలకు మాంసాన్ని పంపిణీ చేశారు. భోలక్‌పూర్‌లో పెద్ద ఎత్తున ముస్లింలు ఉండటంతో ఆధ్యాత్మిక శోభ వెల్లువిరిసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖదీర్, రావుల శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో..

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ వేడుకలను గురువారం సందడిగా నిర్వహించుకున్నారు. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో వందలాది ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు.



శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న దృశ్యం


బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు బిజ్జి శత్రు


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి

బీజేపీతోనే దేశ పురోగతి సాధ్యం


బాగ్‌అంబర్‌పేటలో కేరళ బీజేపీ నాయకురాలు జీఎస్ సుమలత


నల్లకుంటలో శక్తి కేంద్రం ఇన్‌చార్జీలతో బిందు

అంబర్‌పేట: బీజేపీతోనే దేశ పురోగతి సాధ్యమని స్వల్పకాలిక విస్తారక్, కేరళ బీజేపీ నాయకురాలు జీఎస్.సుమలత అన్నారు. గురువారం బాగ్‌అంబర్‌పేటలో నిర్వహించిన మహా అభియాన్ సంపర్క్ కార్యక్రమానికి ఆమె హాజరై స్థానికంగా బూత్‌స్థాయిలో పార్టీ పటిష్టత పరిస్థితులను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం గత ప్రభుత్వాలకు భిన్నంగా పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ బి.వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ బి.పద్మ వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకులు చుక్క జగన్, అచ్చిని రమేష్, వెంకటేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

నల్లకుంటలో ..

నల్లకుంట: రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ కేరళ రాష్ట్రానికి చెందిన బాధ్యురాలు బిందు సూచించారు. బీజేపీ చేపట్టిన 'మహాజన సంపర్క్ అభియాన్'లో భాగంగా ఆ పార్టీ కేరళ రాష్ట్రానికి చెందిన బాధ్యురాలు బిందు గురువారం నల్లకుంటలో పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్పొరేటర్ అమృత నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశమై ప్రధాని మోదీ ప్రవేశపెట్టి అమలు చేస్తున పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకై ఇటీవల చేపట్టిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేశ్, డివిజన్ అధ్యక్షుడు రమణా నాయుడు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బీజేపీ నగర నాయకులు ఎంబీ. కిశోర్ కుమార్, మహేందర్, మధు యాదవ్, మురళి, ప్రశాంత్ జోషి, మహేష్, రాజశేఖర్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

దివ్యాంగుల మహాధర్నాను జయప్రదం చేయాలి


మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జూలై 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే దివ్యాంగుల మహాధర్నాను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, అ డివయ్య పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దివ్యాంగుల మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో దివ్యాంగులకు రక్షణ లేకుండాపోతుందన్నారు. బాలికలు, మూగ, చెవిటి, మానసిక మహిళా దివ్యాంగులపై లైంగిక వేధింపులు, అత్యాచారులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో కోశాధికారి వెంకటేష్, శశికళ, రంగారెడ్డి, క్రాంతి కుమార్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 'ఆర్వో' ఏర్పాటు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ ఈస్ట్ ఎంసీహెచ్ కాలనీలోని మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్యూరీఫయర్ (ఆర్వో) ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని నాయిని ఫౌండేషన్ చైర్మన్, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరీఫయర్‌ను క్రీడాకారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు సీహెచ్.వీరారెడ్డి, బొల్లం శ్రీనివాస్, సోమేశ్వర్, మురళీ, రమేష్, జైపాల్‌రెడ్డి, సుధాకర్, మహేష్, రమణ, ఎం.ఎస్.చారి, బీఆర్ఎస్ నాయకులు సిరిగిరి శ్యామ్, నేత శ్రీనివాస్, రేశం మల్లేష్, లక్ష్మణ్, బాలరాజు, సదా, బుజ్జి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.


క్రీడాకారులతో కలిసి ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రేపటి నుంచి కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జనార్దనమూర్తి

చిక్కడపల్లి: ప్రముఖ సాహితీవేత్త, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ 85వ జన్మదినం సందర్భంగా త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆయన సాహితీ సప్తాహం జూలై 1 నుంచి 7 వరకు ఏడు రోజుల పాటు కళాసుబ్బారావు కళావేదికపై జరుగుతుంది. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం విలేకర్ల సమావేశంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తెలియజేస్తూ ఇనాక్‌ను గానసభతో ఎంతో అనుబంధం ఉందని ఆయన వ్యక్తిత్వం, సాహిత్య విశిష్టతను దృష్టిలో ఉంచుకుని సాహిత్య సప్తాహం పేరిట ఆయన వివిధ ప్రక్రియల్లోని రచనలు ఆవిష్కరిస్తామని తెలిపారు. వరుసగా వ్యాస పరిణామం, వలస, దిక్కులేనోడు, విశాలశూన్యం, విమర్శిని, పాలి, ఆల్ఫ్ ఆఫ్ పార్డన్ సంపుటిలను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, మాజీ మంత్రి బుద్ధప్రసాద్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో గుండవరపు గీతాదేవి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాయిచంద్‌కు ప్రజాపంథా నివాళి

ముషీరాబాద్: ప్రముఖ గాయకుడు, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మరణం పట్ల సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఆయన మరణం కుటుంబానికి, సంస్కృతిక రంగానికి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. సాయిచంద్ కుటుంబం ప్రజాపంథాలో పని చేసేదని తండ్రి వెంకటరాములు మహబూబ్‌నగర్ జిల్లా అమరచింతలో పార్టీ కార్యకర్తగా, అరుణోదయ రాష్ట్ర నాయకులుగా పని చేశారని సాయిచంద్ చిన్న వయస్సు నుంచే ఉద్యమంతో సంబంధం ఉందని పీడీఎస్‌యూ, అరుణోదయలో పని చేశారని తెలిపారు. ఆయన మరణం పట్ల న్యూ డెమాక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోవర్ధన్ సంతాపాన్ని ప్రకటిస్తూ ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షత

కాచిగూడ: బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం పూర్తి వివక్షతతో వ్యవహరిస్తోందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. గురువారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్, అసెంబ్లీలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం ఇప్పటి వరకు 14 శాతం దాటలేదని తెలిపారు. దేశ జనాభాలో 70 కోట్ల మంది ఉన్న బీసీల రాజకీయ ప్రాతినిధ్యం 50 శాతానికి పైగా పెరగాలని అన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లును చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ క్రిమిలేయర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. బీసీ మహాసభ నేతలు డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, ధరణీధర్‌యాదవ్, మెట్టు ముత్యాల్‌రావు, భూషణ్ భాస్కర్, పులిజాల కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం ఆగిందని ఆర్యనగర్ వాసుల నిరసన

లాలాపేట: నెల రోజుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణం ఆగిపోయిందని గురువారం ఆర్యనగర్ వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదపుగా రూ 7 కోట్ల మేరకు బిల్లులు రావాల్సి ఉంది ...బిల్లులు చెల్లించే వరకు పనులు చేసేది లేదని ఇంజనీరింగ్ అధికారులకు లెటర్ ఇచ్చానని కాంట్రాక్టర్ అంటున్నాడని వారు ఆరోపిస్తున్నారు. దీంతో శాంతినగర్ ఆర్యనగర్‌లో నూతన చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులు నిలిచిపోయాయి. ఈ విషయమై సదరు కాంట్రాక్టర్‌ను నిలదీయగా తనకు జీహెచ్ఎంసీ నుంచి పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు రోడ్డు నిర్మాణం చేయనని అధికారులకు చెప్పినట్లు కాంట్రాక్టర్ ఖరాకండిగా చెప్తున్నాడు.

మాజీ ప్రధాని పీవీకి భారతరత్న ఇవ్వాలి

లిబర్టీ: దివంగత పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇవ్వాలని లోక్ దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకట రాజేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... దేశంలో ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రధానిగా ఉన్న పీవీ సరళీకృత ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టి ఆర్థిక రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. 1995లో తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు అనేక దేశాలు పీవీని అభినందించాయని ఆయన అన్నారు. రాజకీయ విలువలతో కూడిన జీవితాన్ని గడిపారని తన రాజకీయ జీవితంలో మచ్చలేని మహోన్నత వ్యక్తిగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

నల్లకుంట: తొలి ఏకాదశిని పురస్కరించుకొని గురువారం అంబర్‌పేట నియోజకవర్గంలోని వైష్ణవాలయాలు భక్తులతో పోటెత్తాయి. న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారాంజనేయ సరస్వతి ఆలయంలోని కృష్ణ మందిరంలో అర్చకుల మంత్రోచ్చారణల నడుమ రాధాకృష్ణులకు అభిషేకం, విశేష పూజలు చేశారు. అలాగే మహిళలచే విష్ణు సహస్ర నామ పారాయణ జరిగింది. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. ముందుగా పర్వత వర్ధిని రామలింటేశ్వర ఆలయంలో గణపతికి అభిషేకాలు, ఆది పూజలు చేశారు. శివుడికి అభిషేకాలు చేశారు.


రాధాకృష్ణులకు పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వామి


శివుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

క్రీడలతోనే అంతర్జాతీయ గుర్తింపు

కాచిగూడ: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యా కిషన్‌రెడ్డి అన్నారు. ఈజిప్ట్ రాజధాని కైరోలో ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు జరిగిన చాంపియన్‌షిప్ పోటీల్లో భారతదేశం తరఫున స్విమ్మర్ గంధం క్వీని 200 మీటర్ల మహిళల విభాగంలో, 400 మీటర్ల మహిళల విభాగంలో పాల్గొని రెండు రజత పతకాలు సొంతం చేసుకుని రికార్డు కెక్కింది. బర్కత్‌పురకు చెందిన గంధం క్వీని భారత దేశం తరఫున అంతర్జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని రజత పతకాలు సాధించడం పట్ల గురువారం బర్కత్‌పురలో క్వీనిని కాచిగూడ కార్పొరేటర్ ఉమాతో కలిసి కావ్యా కిషన్‌రెడ్డి అభినందించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్రీడలకు వయస్సుతో నిమిత్తం లేదని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బండారి సంతోష్, సుభాష్ పటేల్, ఆరవింద్, వాసు, హజారి బాబు, సురేష్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, రామకృష్ణ, రాము, దినేష్ పాల్గొన్నారు.


క్వీని విక్టోరియాను అభినందిస్తున్న కావ్యా కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ ఉమా తదితరులు

సాయిచంద్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటు


సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు


ముషీరాబాద్: సాయిచంద్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ గాయకుడు సాయిచంద్ మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, పార్టీ సీనియర్ నాయకులు రెబ్బ రామారావు, యువజన కమిటి అధ్యక్షులు కె.ఎం.సాయి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వంగాల నర్సింగ్‌రావు, నాయకులు గోవింద్‌రాజ్, కృష్ణ, ప్రవీణ్, మహేష్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి: సినిమాలకు ముళ్లపూడి వెంకటరమణ అద్భుతమైన రచనలు అందించిన గొప్పవ్యక్తి అని అలాంటి గొప్ప వ్యక్తి మరో దశాబ్ది కాలం వరకూ లభించకపోవచ్చని సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. రచయిత ముళ్లపూడి వెంకటరమణ 92వ పుట్టినరోజు వేడుకలు గురువారం త్యాగరాయగానసభలో అక్షజ్ఞ పబ్లికేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. ముళ్లపూడి హాస్య కథల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పార్వతీశం మాట్లాడుతూ.. ప్రపంచ అస్థిత్వాన్ని ప్రజలకు అందించిన గొప్ప మహనీయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆవిష్కృతగ్రంథం తొలి రావీని స్వీకరించి విజేతలకు ముళ్లపూడి శ్రీదేవి బహుమతులు ప్రదానం చేశారు. రాము, సినీ దర్శకులు శివనాగేశ్వర్‌రావు, కార్టూనిస్టు శంకు, గోపాల్‌యాదవ్, భాగిశాస్త్రి, భావరాజు పద్మిని, వెంకట్, బిఎస్ శర్మ, శరత్‌కుమార్ పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్వతీశం, ముళ్లపూడి శ్రీదేవి

డాక్టర్ జగన్‌మోహన్‌కు వైద్య శిరోమణి అవార్డు



కాచిగూడ: వైద్య రంగంలో 30 ఏళ్లుగా పేద ప్రజలకు, రోగులకు అపారమైన వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్య నిపుణుడు ప్రొఫెసర్ డాక్టర్ బి.జగన్‌మోహన్‌కు వైద్య శిరోమణి అవార్డును అందించనున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.రాజ్ నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. గురువారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా భారతరత్న డాక్టర్ బీసీ రాయ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది తెలంగాణ రాష్ట్రం నుంచి ఒకే ఒక్కరికి ఇచ్చే ఈ అవార్డును 2023కు గాను జగన్‌మోహన్‌కు అందించనున్నామని ఆయన పేర్కొన్నారు. బర్కత్‌పురలో జూలై 1న ఉదయం 10:30 గంటలకు వైద్యుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో ఆయనకు అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జస్టిస్ వామన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నాణేల దివ్య దర్శనం

నల్లకుంట: షిరిడీ సాయిబాబా తన భక్తురాలైన లక్ష్మీ బాయి షిండేకు ప్రసాదించిన 9 నాణేలు గురువారం సాయంత్రం షిరిడీ నుంచి నల్లకుంటలోని శివం మందిరానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా షిరిడీ నుంచి నాణేలను తీసుకొచ్చిన లక్ష్మీబాయి షిండే ముని మనవడు అరుణ్ గైక్వాడ్ షిండేకు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై సాయిబాబా ప్రసాదించిన నాణేలకు పూజలు నిర్వహించారు. అనంతరం సాయి భక్తులు పెద్ద ఎత్తున నాణేలను సందర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సంస్థలు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు డిటైర్డ్ డీజీపీ హెచ్‌జే దొర, శేష సాయి, రాజేందర్, ఎంఎల్ఎన్ స్వామి, లక్ష్మీ నరసింహ పాల్గొన్నారు.



షిరిడీ సాయిబాబా ప్రసాదించిన 9 నాణేలను ప్రదర్శిస్తున్న దృశ్యం

బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో బీజేపీ విజయం సాధించాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు సూచించారు. బీజేపీ నగర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అంబర్‌పేట అసెంబ్లీ విస్తారక్‌ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసగించారు. అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోట అని అందుకే ప్రతిఒక్క కార్యకర్త బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని గౌతంరావు మార్గదర్శనం చేశారు. నియోజకవర్గంలో నెలకొన్న ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రజల తరఫున పోరాటం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణగౌడ్, సూర్యప్రకాష్ సింగ్, శ్యామ్‌రాజ్, అమృత, వనం రమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సోమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (30) యాకుత్‌పురా–ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుని ఒంటిపైన గోధుమ కలర్ ఫుల్ షర్టు, బూడిద కలర్ ప్యాంట్ ఉంది. కుడిచేతి పైన తెలుగులో అమ్మ అని పేరుతో ట్యాటూ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.